www.prajasakti.com

ప్రజాశక్తి

గురువారం 25 జనవరి 2024 | 5 | తూర్పుగోదావరి



అంగన్వాడీ కేంద్రాల్లో పాడైన పోషకాహారం

ప్రజాశక్తి-తాళ్లపూడి

అంగన్వాడీలు సమ్మె విరమించిన తరువాత బుధవారం టీచర్లు ఆయాలు తమకు సంబంధించిన కేంద్రాలను తెరవడానికి వెళ్ళిన సిబ్బంది ఇబ్బందులు గురయ్యారు. కొన్ని సెంటర్ల తాళాలు ఎక్కడ ఉన్నాయో కూడా తెలియని పరిస్థితి. మరి కొన్ని కేంద్రాల్లో ప్రభుత్వం చిన్నారులకు సరఫరా చేసే పాల ప్యాకెట్లు ఇతర పోషకాహారాలు పురుగులు పట్టి పాడైపోయాయి. అంగన్వాడీ సిబ్బంది సమ్మెలో ఉన్న కాలంలో కొన్ని శాఖల అధికారులు ఆయా కేంద్రాల తాళాలు బద్దలు కొట్టినప్పటికీ చిన్నారులకు అందించే పోషకాహారాలను జాగ్రత్త చేయడంలో ఎందుకు శ్రద్ధ చూప లేదో అర్థం కావడం లేదని ఆయా కేంద్రాలు అస్తవ్యస్తంగా ఉన్నాయని టీచర్లు గగ్గోలు పెడుతున్నారు.

అక్రమంగా ఇసుక తవ్వకాలు

- ఏటిగట్టుకు పొంచిన ప్రమాదం
- పట్టా భూముల్లో తవ్వకాలు
- భారీ వాహనాలతో రోడ్లు ధ్వంసం

ప్రజాశక్తి - సీతానగరం

సీతానగరం మండలంలో మునికూడలి ఇసుక ర్యాంపులో అక్రమంగా లంక భూముల్లో సైతం భారీగా ఇసుక తవ్వకాలు సాగుతున్నాయి. గత నెలలో నష్టపోయిన రైతులను ఆదుకోవాలంటూ ఇసుక లారీలను సైతం అడ్డుకున్నారు. లంక భూముల్లో పట్టాలు కలిగిన రైతుల భూముల నుంచి సైతం అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారని స్థానిక నియోజకవర్గ ప్రజాప్రతినిధికి తెలియజేసినా తమకు న్యాయం జరగలేదని వారు ఆవేదన చెందుతున్నారు. గతంలో ఈ భూముల్లో బోరులు వేసి వ్యవసాయం చేసుకున్నామని ఆ బోరులను సైతం తొలగించి పట్టా భూముల్లో అక్రమంగా ఇసుక సాగిస్తున్నారని రైతులు తెలిపారు. గతంలో ఇసుక తవ్వకాలు చేసే స్థలాల్లో రైతులకు నష్టపరిహారం చెల్లించేవారని, నేడు ఎటువంటి నష్టపరిహారం రైతులకు చెల్లించకుండానే దౌర్జన్యంగా ఇసుకను తరలిస్తున్నారని చెప్పారు. ఇదేమిటని అడిగితే మీకు చెప్పాల్సిన అవసరం లేదంటూ తమపై దౌర్జన్యానికి దిగుతున్నారని రైతులు వాపోతున్నారు. గతంలో ఈ లంక భూముల్లో పుచ్చపాదులు, నాటు పొగాకు, దోస పాదులు, గుమ్మడి పాదులు వేసి జీవనం సాగించే వారిమని, ఇప్పుడు దౌర్జన్యంగా ఇసుక మాఫియా ఇష్టానుసారంగా అనుమతులు మించి లోతుగా ఇసుక తవ్వకాలు జరిపి తమను నడివీధిన నిలబెడుతున్నారని వాపోతున్నారు. ఇది మీ భూమి కాదంటూ దౌర్జన్యానికి దిగుతున్నారని అధికారులకు తెలియజేసినా పట్టించుకున్న నాథుడే లేడని స్థానిక రైతులు అంటున్నారు. గతంలో ఈ లంక పొలాలకు చెందిన రైతులకు 95 ఎకరాలకు గాను రూ.రెండు లక్షలు రైతులకు ఇస్తామని చెప్పి చివరకు అది కూడా ఇవ్వకుండా ఇసుకను అక్రమంగా తరలించుకు పోయారన్నారు. ఈ అన్యాయంపై ప్రశ్నించిన రైతులను కేసులు పెట్టి జైలుకు పంపిస్తామని బెదిరించారంటున్నారు. ప్రక్కలంక విఆర్ఒ వచ్చి తూతూ మంత్రంగా కొలతలు చేసేపట్టి మాకు ఎటువంటి కాగితం రూపంలో వివరణ ఇవ్వకుండానే వెళ్లిపోతున్నారని వాపోయారు. రహదారిపై అధిక బరువుతో ఇసుకను రవాణా చేయడం వల్ల రోడ్లు ఎప్పటికప్పుడు ధ్వంసమై ప్రమాదాలు జరుగుతున్నాయని చెప్పారు. ఇసుకకు ఎక్కడలేని డిమాండ్ ఏర్పడటంతో ర్యాంపుల్లో తవ్వకాలు జోరందుకున్నాయి. ఎపిఎండిసి, జెపి సంస్థలు ఇసుక అమ్మకాల బాధ్యతను ప్రతిమా సంస్థకు అప్పగించింది. మునికూడలి ఇసుక ర్యాంపులో స్థానిక అధికార పార్టీ నాయకుడు చక్రం తిప్పడంతో ప్రతిమా సంస్థ ఆధ్వర్యంలో నదీ గర్భంలోనే పడవ సంఖ్యలో మిషన్లతో ఇసుక తవ్వకాలు సాగిస్తున్నారు. కొన్ని ఇసుక ర్యాంపులను గతేడాది నవంబరులోనే గడువు తీరినా మరికొన్నింటికి ఈ మార్చితో కాలపరిమితి ముగిసింది. అయినప్పటికీ ర్యాంపుల నిర్వాహకులు అనధికారికంగా ఇసుక తవ్వకాలు సాగిస్తున్నారు. అందిన కాడికి ఇసుకను అమ్ముకుంటూ సొమ్ము చేసుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పర్యావరణ అనుమతులు పాటించకపోయినా అధికారులు మాత్రం చూసిచూడనట్లు వ్యవహరిస్తున్నారంటున్నారు. రాత్రనకా పగలనకా భారీ లారీలతో ఇసుకను తరలిస్తున్నారు. దీంతో ఏటిగట్టు, కాతేరు నుంచి సీతానగరం వరకు రహదారికి తూట్లు పడుతున్నాయి. జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ప్రతి రెండు మూడు నెలలకు ఒకసారి జరగాల్సిన జిల్లా స్థాయి సాండ్ కమిటీ సమావేశాలు కూడా సక్రమంగా జరగడం లేదని ప్రజలు అంటున్నారు. సీతానగరం మండలంలో మునికూడలి మీదుగా ఉభయ గోదావరి జిల్లాల్లో వందలాది ఇసుక ర్యాంపులున్నా నూటికి 95 శాతం ర్యాంపులు అనుమతులు లేకుండానే నిర్వహిస్తున్నారంటున్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఒక్కో లారీకి 47 టన్నుల ఇసుకను లోడ్ చేస్తున్నారు. మైనింగ్, ఇరిగేషన్, రెవెన్యూ అధికారులెవరూ కూడా వాటివైపు కన్నెత్తి చూడడం లేదని ప్రజలు అంటున్నారు. ఏటిపట్టి వాసుల భద్రత కోసం ఏర్పాటు చేసిన ఏటిగట్టును ఇసుక తరలింపు కోసం ఎక్కడపడితే అక్కడ తూట్లు చేస్తున్నారు. ఆగస్టు నెలలో ఉధృతంగా ప్రవహించే గోదావరితో మండల వాసులు ప్రాణాలు అరచేతుల్లో పెట్టుకునే పరిస్థితులు ఏర్పడుతున్నప్పటికీ అప్పటికప్పుడు స్థానిక నాయకులు వచ్చి తూతూ మంత్రంగా ఇసుక బస్తాలు వేయించి వెళ్లిపోతున్నారని చెప్పారు. వాస్తవానికి నది గట్ల మీద కేవలం 10 టన్నుల బరువున్న వాహనాలు వెళ్ళేందుకు మాత్రమే అనుమతి వుంటుంది. కానీ 47 టన్నుల బరువు గల వాహనాలు కూడా ఏటిగట్ల మీద రవాణా సాగిస్తున్నాయి. దీనికితోడు కొన్ని ర్యాంపులు నివాసిత ప్రాంతాలకు సమీపంలో ఏర్పాటు చేయడం వల్ల ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడక తప్పడం లేదని ప్రజలు అంటున్నారు. ర్యాంపుల నుంచి ప్రభుత్వ యంత్రాంగానికి భారీగా ముడుపులు అందడం వల్లే వారు నోరు మెదపడం లేదని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి.



నిబంధనలకు విరుద్ధంగా నదీ గర్భంలో ఇసుక తవ్వకాలు



భారీ యంత్రాలతో ఇసుక తవ్వకాలు

మునికూడలి ఇసుక ర్యాంపునకు అనుమతుల్లేవు

మునికూడలి ఇసుక ర్యాంపుకు సంబంధించి ఇప్పటి వరకు అధికారికంగా ఎటువంటి పర్యావరణ అనుమతులు లేవు. రెండు రోజుల్లో అనుమతులపై స్టాండింగ్ కమిటీ నివేదిక అందించనుంది.

- సుబ్రహ్మణ్యం, ఎడి మైన్స్, రాజమహేంద్రవరం.

ప్రజారోగ్యానికి ప్రాధాన్యత అవసరం

ప్రజాశక్తి-రాజానగరం

ప్రజారోగ్యానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష, ఫ్యామిలీ డాక్టర్ అవసరమైన పథకాలని కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ సహాయమంత్రి ఎస్‌పి సింగ్ బఘేల్ అన్నారు. లాలా చెరువు పిహెచ్‌సిని మంత్రి బఘేల్ బుధవారం సందర్శించారు. కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య పథకం ద్వారా అందచేస్తున్న వివిధ ఆరోగ్య సేవలు వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల ద్వారా వైద్య సేవలు అందించే క్రమంలో ప్రజల వద్దకు వైద్య సేవలు తీసుకుని వెళ్లే ఆలోచన స్ఫూర్తి కల్పిస్తోందని మంత్రి అన్నారు. ఆ మేరకు వైద్య సేవలు, ఉచితంగా వైద్య పరీక్షలు, మందులు అందించడం పట్ల తీసుకుంటున్న చర్యల నేపథ్యంలో ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి చొరవను అభినందించారు. కేంద్ర ప్రభుత్వ వైద్య ఆరోగ్య పరంగా తీసుకుంటున్న చర్యలకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతో దోహదం చేసేలా నిలుస్తాయని పేర్కొన్నారు. అనంతరం జగనన్న కంటి వెలుగు లబ్ధిదారులకు కేంద్ర మంత్రి కంటి అద్దాలు అందచేశారు. పిహెచ్‌సి ద్వారా అందచేస్తున్న వైద్య సేవలు నిక్షిప్తం చెయ్యడం ద్వారా ఫాలో అప్ వైద్య సేవలు అందించాలని సూచించారు. రాష్ట్రంలో జగనన్న ఆరోగ్య సురక్ష, ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ గురించి జిల్లా కలెక్టర్ డా కె.మాధవీలత కేంద్ర మంత్రికి వివరించారు. ఈ కార్యక్రమంలో సహాయ కలెక్టర్ సి.యస్వంత్ కుమార్, డిఎంహెచ్‌ఓ డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, డిసిహెచ్‌ఎస్ డాక్టర్ ఎం.సనత్ కుమారి, బిజెపి రాష్ట్ర నాయకులు సోము వీర్రాజు, పాల్గొన్నారు.



కంటి అద్దాలు పంపిణీ చేస్తున్న కేంద్ర మంత్రి

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం రూరల్

ప్రజా ఆరోగ్య పరిరక్షణకు పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని మంత్రి చెల్లుబోయిన వేణుగోపాల కృష్ణ పేర్కొన్నారు. స్వచ్ఛత మన బాధ్యత.. గుడ్ మార్నింగ్ కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆయన రాజమండ్రి రూరల్ 17వ వార్డు, ఐఎసిఎల్ కాలనీ, శంభు నగర్ కాలనీల్లో పర్యటించారు. పలు డ్రైనేజీలు, పార్కుల పరిశుభ్రత, విద్యుత్ దీపాలు వంటి పలు సమస్యలు తెలుసుకున్నారు. వాటి పరిష్కారం నిమిత్తం నగరపాలక సంస్థ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం మంత్రి వేణు మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం కోసం స్వచ్ఛతతో కూడిన పరిసరాల పరిశుభ్రత ఎంతో అవసరమని చెప్పారు. ఆ మేరకు సంబంధిత శాఖల అధికారులు ప్రజలకు మెరుగైన పారిశుధ్యం కల్పించే దిశగా తగు చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. ఐఎసిఎల్ కాలనీలోని మహిళలతో మాట్లాడారు. వారు వివరించిన సమస్యల పరిష్కారానికి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఎస్ఇ పాండురంగారావు, హెల్త్ ఆఫీసర్ ఎ.వినూత్న పాల్గొన్నారు.



పారిశుధ్యంపై అధికారులతో మాట్లాడుతున్న వేణు

ఇవిఎంల గొడౌన్‌లో కలెక్టర్ తనిఖీ

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

స్థానిక ఎఫ్‌సిఐ గొడౌన్‌లో ఏర్పాటు చేసిన ఇవిఎంలను కలెక్టర్ మాధవీలత బుధవారం పలు రాజకీయ పార్టీలతో కలిసి తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ ఇప్పటికే ఓటరు తుది జాబితా ప్రకటించామన్నారు. త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో తూర్పు గోదావరి జిల్లాకు కేటాయించిన ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలకు చెందిన యూనిట్స్ బ్యాలెట్ యూనిట్స్, కంట్రోల్ యూనిట్స్, వివి ప్యాట్స్‌ను తనిఖీ చేసి భద్రపరిచామన్నారు. కేంద్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు సాధారణ తనిఖీల్లో భాగంగా నేడు రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి తనిఖీ చేసినట్టు కలెక్టర్ తెలిపారు. పోలీసు భద్రతతో పాటు, సిసి కెమెరాల ద్వారా పర్యవేక్షణ చేస్తున్నట్లు తెలిపారు. యూనిట్స్ పనితీరుపై కేంద్ర ఎన్నికల కమిషన్‌కు నివేదిక ఇచ్చినట్టు తెలిపారు. కలెక్టర్ వెంట అర్బన్ తహశీల్దార్ వి.సుస్వాగతం, రాజకీయ పార్టీల ప్రతినిధులు నలబాటి రమేష్ (కాంగ్రెస్), వై.రాజశేఖర్, రాయుడు గణేష్ (వైసిపి) సలాది ఆనంద్ సిహెచ్.శ్రీనివాసరావు (టిడిపి), బి.రామచంద్రరావు (బిజెపి) కలెక్టరేట్ ఎన్నికల డిటి సునీల్ తదితరులు ఉన్నారు.



గొడౌన్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్

సాధికారత వర్క్ షాప్‌నకు స్పందన

ప్రజాశక్తి-రాజానగరం

ఎపిలో యువ సాధికారత, ఉపాధి అనే అంశంపై ఆదికవి నన్నయ యూనివర్సిటీలో బుధవారం నిర్వహించిన వర్క్ షాప్‌నకు విశేష స్పందన వచ్చింది. విశ్వవిద్యాలయ ప్రాంగణాల అధ్యాపకులతో పాటు అనుబంధ కళాశాలల అధ్యాపకులు, విద్యార్థులు ఈ వర్క్ షాప్‌నకు హాజరయ్యారు. విసి ఆచార్య కె.పద్మరాజు, రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్ వర్క్ షాప్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా విసి పద్మరాజు మాట్లాడుతూ ఎపి ప్రభుత్వం ఉన్నత విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. దీనిలో భాగంగా ఇంటర్న్‌షిప్ ప్రోగ్రామ్స్ విజయవంతంగా నిర్వహిస్తున్నారని చెప్పారు. నూతన జాతీయ విద్యా విధానాన్ని పూర్తి స్థాయిలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అమలు చేస్తోందని తెలిపారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై త్వరలో నన్నయ విశ్వవిద్యాలయ ప్రాంగణంలో శిక్షణ అందిస్తామని తెలిపారు. ఆచార్య కె.శ్రీరమేష్, కో కన్వీనర్ డాక్టర్ పి.ఉమామహేశ్వరి దేవి, డాక్టర్ ఎన్.ఉదయభాస్కర్, డాక్టర్ సుజాత పాల్గొన్నారు.



వర్క్ షాప్‌ను ప్రారంభిస్తున్న విసి

కార్టూన్ 'నిజం'



మా నియోజకవర్గంలో పురుషులు మహిళా ఓటర్ల కంటే దొంగ ఓట్లు.. ఎక్కువ..!!

ఎల్ఐసి ఏజెంట్స్ దినోత్సవం

ప్రజాశక్తి-గోకవరం

గోకవరం ఎల్ఐసి బ్రాంచ్‌లో ఏజెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏజెంట్స్ ప్రొఫెషన్ ప్రొటెక్షన్ డే కార్యక్రమం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఎల్ఐసి ఏజెంట్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్, సెక్రెటరీ కోరుకొండ నూకరాజు, నాగారపు నాగరాజు మాట్లాడారు. దేశంలో ఏజెంట్స్ అందరూ తమ హక్కులను కాపాడుకోవడానికి ఎపిపిడి ఏర్పాటయ్యిందని చెప్పారు. ఏజెంట్స్ పాలసీదారులతో గౌరవ మర్యాదలతో నడుచుకోవాలని వారికి ఏ పాలసీ కావాలో వారి అవసరాన్ని గుర్తించి, తదనగుణంగా పాలసీలు ఇచ్చి వ్యాపారం అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. గోకవరం బ్రాంచ్‌లో సీనియర్ ఏజెంట్స్ పాపాని అప్పారావు, ఎర్రి నాయుడు, పెద్దిరెడ్డి అప్పారావు, తలారి సూర్య ప్రకాశరావును ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ట్రెజరర్ పంపల వెంకన్న దొర, డివిజనల్ కౌన్సిల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ చోడిశెట్టి గోపీనాథ్ గుప్తా, ఇసి మెంబర్స్ వాకచర్ల రామకృష్ణ, కర్రి బండి విష్ణుమూర్తి, తాటికొండ సుబ్రమణ్యం, పి.రాజు, గొర్రుల అర్జున్ నాయుడు, మెప్పెల్లి జయరాజు, ఎం.సూరిబాబు పాల్గొన్నారు.

విధుల్లోకి అంగన్‌వాడీలు, హెల్పర్లు

ప్రజాశక్తి-చాగల్లు

మండలంలోని పలువురు అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ బుధవారం విధులకు హాజరయ్యారు. ఐసిడిఎస్ అధికారులు సచివాలయం ఎంఎస్‌కెల ద్వారా అంగన్వాడీ కేంద్రాలను హేండోవర్ చేసుకున్నారు. కేంద్రాల్లో మెటీరియల్ రిసీవ్ చేసుకుని కేంద్రం నిర్వహణకు ఏర్పాట్లు చేసుకున్నారు ఈ సందర్భంగా అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ లీడర్స్ పి.విజయ కుమారి, జె.మహాలక్ష్మి మాట్లాడుతూ 42 రోజులుగా తమ ఉద్యమానికి మద్దతు తెలిపిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

విద్యా రంగ సంస్కరణలు కొనసాగాలి

ప్రజాశక్తి-బిక్కవోలు

విద్యారంగంలో సంస్కరణలు కొనసాగాలాని, మళ్లీ సిఎంగా వైఎస్.జగన్ రావాలని వ్యవసాయ సలహా కమిటీ మండల చైర్మన్ నల్లమిల్లి వెంకటరెడ్డి అన్నారు. బుధవారం బలభద్రపురంలో జెడ్‌పి పాఠశాలలో ఎనిమిదో తరగతి విద్యార్థులకు ట్యాబ్, స్టడీ మెటీరియల్, బుక్స్ పంపిణీ చేశారు. జెడ్‌పిటిసి రొంగల పద్మావతి, సర్పంచ్ బుంగా రామారావు, ఎపి స్పోర్ట్స్ అథారిటీ డైరెక్టర్ గుబ్బల అలేఖ్య, పాఠశాల హెచ్‌ఎం సివివి.సత్యనారాయణమూర్తి పాల్గొన్నారు.

ఓటు హక్కుపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి - సీతానగరం

జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం వీరభద్రరావు ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పురవీధుల్లో ఓటు అవగాహనపై విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఓటు మన అందరి బాధ్యత అని నినాదాలు చేశారు. అనంతరం వ్యాసరచన పోటీల్లో గెలిచిన విద్యార్థులకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు పొగిరి కృష్ణారావు, ఎంఇఒలు స్వామి నాయక్, ముత్యాలు, ఉపాధ్యాయులు కె.సతీష్ బాబు, ఉమాదేవి, రాజేష్, సిఆర్‌పి బేగం పాల్గొన్నారు.

సిటిజన్ రైట్స్ సభ్యునిగా శ్రీకాంత్

ప్రజాశక్తి-కడియం

మురమండ గ్రామానికి చెందిన షేక్ శ్రీకాంత్ కౌన్సిల్ ఫర్ సిటిజన్ రైట్స్ జిల్లా సభ్యునిగా నియమితులయ్యారు హైదరాబాద్ కేంద్రంగా ఉభయ తెలుగు రాష్ట్రాల్లో సమాచార హక్కుల కోసం ఈ సంస్థ పాటు పడుతోందని జిల్లా కో ఆర్డినేటర్ పోసి కృష్ణ తెలిపారు.

ఎర్రమట్టి తవ్వకాలపై ఫిర్యాదు

ప్రజాశక్తి - సీతానగరం

నిబంధనలకు వ్యతిరేకంగా ఎర్రమట్టి తవ్వకాలపై న్యాయవాది చిడిపి నకుల సురేష్ తహశీల్దారుకు బుధవారం ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నల్లగొండ గ్రామ పరిధిలో సర్వే నెంబర్ 241/3లో ఉన్న కొండ భూభాగాన్ని పెందుర్తి హనుమంతరావు, ఎంపిడిఒ కె.రమేష్ ఇష్టానుసారం తవ్వేస్తున్నారన్నారు. దళితులు, గిరిజనులకు ప్రభుత్వం అందించిన డి.పట్టా భూముల్లో తవ్వకాలు జరుపుతున్నారని గతంలో అనేకసార్లు ఫిర్యాదు చేసినా అధికారులు ఎటువంటి చర్యలూ తీసుకోలేదన్నారు. ఈ విషయమై తహశీల్దారు, రెవెన్యూ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినట్టు ఆయన తెలిపారు. ఆయన వారు ఏ విధమైన చర్యలూ తీసుకోలేదని తెలిపారు. తక్షణం చర్యలు తీసుకోని యెడల తాను న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని ఆయన హెచ్చరించారు.

'ఆడుదాం ఆంధ్రా'తో ప్రతిభ వెలికితీత

జిల్లాలో పలుచోట్ల బుధవారం ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు నిర్వహించారు.

ప్రజాశక్తి- యంత్రాంగం

రాజమహేంద్రవరం రూరల్ గ్రామీణ ప్రాంతంలో యువకుల క్రీడా ప్రతిభను వెలికి తీసేందుకు ప్రతిష్టాత్మకంగా ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని ప్రవేశ పెట్టినట్టు మంత్రి చెల్లుబోయిన వేణుగోపాల కృష్ణ పేర్కొన్నారు. హుకుంపేటలో రాజమండ్రి రూరల్ నియోజకవర్గ స్థాయి ఆడుదాం..ఆంధ్రా ఆయన ప్రారంభించారు. జాతీయస్థాయి వాలీబాల్, బాక్సింగ్ పోటీల్లో విజేతలుగా నిలిచిన వై.లలితా దేవి, ఎన్.ప్రజ్ఞను మెమెంటో, శాలువాలతో ఆయన ఘనంగా సత్కరించారు. వారిని క్రీడాకారులు ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నోడల్ అధికారి వి.స్వామి నాయుడు, స్పెషల్ ఆఫీసర్ కెఎన్.జ్యోతి, డిపిఒ జెవి సత్యనారాయణ, ఎంపిడిఒ ఎం.శ్రీనివాసరావు పాల్గొన్నారు. **రాజానగరం** ఆదికవి నన్నయ యూనివర్సిటీ ప్రాంగణంలో క్రీడలను ఎంఎల్ఎ జక్కంపూడి రాజా, జాయింట్ కలెక్టర్ తేజ్ భరత్, విసి ఆచార్య కె.పద్మరాజు, ఆర్‌డిఒ చైత్ర వర్షిణి ప్రారంభించారు. తహశీల్దారు పవన్ కుమార్, ఎంపిడిఒ సుబ్రమణ్యం, వైసిపి నాయకులు మందారపు వీర్రాజు, ప్రగాడ చక్రి, నాగవరపు త్రిమూర్తులు, ఆకుల శ్రీను పాల్గొన్నారు. **చాగల్లు** నియోజకవర్గ స్థాయి క్రీడల్లో భాగంగా కొవ్వూరులో జరిగిన పోటీల్లో చాగల్లు మండలం నుండి ప్రాతినిధ్యం వహించిన షటిల్ బ్యాడ్మింటన్ ఉమెన్స్ టీం ఫైనల్‌లో గెలిచి విజేతగా నిలిచింది. కబడ్డీ మెన్స్ టీమ్ ఫైనల్‌లో గెలిచి విజేతగా నిలిచింది. క్రికెట్ మెన్స్ టీమ్ ఫైనల్‌లో గెలిచి విజేతగా నిలిచింది. విజేతలు, పీడీలు, పిఇటిలను ఎంపిపి మట్టా వీరాస్వామి, జెడ్‌పిటిసి గారపాటి విజయ దుర్గా, ఎంపిడిఒ పి.నిర్మల కుమారి అభినందించారు.



రాజమండ్రి రూరల్‌లో క్రీడలను ప్రారంభిస్తున్న మంత్రి వేణు

కడియపులంకలో ఆరోపణల పంచాయితీ

ప్రజాశక్తి-కడియం

కడియపులంక పంచాయతీలో ఇన్‌ఛార్జి సర్పంచ్‌పై ఆరోపణల్లో పలు ట్విస్టులు చోటు చేసుకుంటున్నాయి. పలువురు వార్డు సభ్యులు కలెక్టర్‌కు పంచాయతీలో అక్రమాలు జరిగాయంటూ ఫిర్యాదు చేయడం, ఆపై ఫిర్యాదు ఉపసంహరించుకోవడం, మళ్లీ అక్రమాలంటూ ఫిర్యాదు చేయడంతో గ్రామస్తులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. గత పంచాయతీ ఎన్నికల్లో కడియపులంక సర్పంచ్‌గా జనసేన పార్టీకి చెందిన మార్గాని అమ్మాణి విజయం సాధించారు. ఆమె మరణంతో ఉప సర్పంచ్ పాటంశెట్టి రామ్‌జీ ఇన్‌ఛార్జి సర్పంచ్‌గా బాధ్యతలు చేపట్టారు. నాటి నుంచి పంచాయతీ రికార్డులు తారుమారు, పంచాయతీ నిధులు దుర్వినియోగం, తరచుగా కార్యదర్శుల మార్పు, కార్యదర్శులకు అప్పగించని రికార్డులు, ఏకపక్షంగా నిధులు ఖర్చు, కాంట్రాక్టర్‌లకు బిల్లుల చెల్లింపుల్లో పక్షపాతం వంటి వాటిపై కొద్ది రోజుల క్రితం వైసిపికి చెందిన వార్డు సభ్యురాలు స్పందనలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ కూడా కొనసాగినట్టు సమాచారం. ఇంతలోనే ఏమైందో, ఆమె తన ఫిర్యాదును ఉపసంహరించుకున్నారు. సోమవారం స్పందనలో గ్రామానికి చెందిన మరికొందరు వైసిపి వార్డు సభ్యులు పాత ఆరోపణలే చేస్తూ కలెక్టర్‌కు మళ్లీ ఫిర్యాదు చేశారు. అసలే అంతంతమాత్రంగా ఉన్న అభివృద్ధి పనులకు బ్రేకులు పడతాయని, పంచాయతీ పరువును మంట కలుపుతున్న సభ్యుల వ్యవహార శైలిని పలువురు గ్రామస్తులు తప్పు పడుతున్నారు.

విద్యార్థినికి రూ.40 వేల సాయం

ప్రజాశక్తి- దేవరపల్లి

సమాజంలో పేదరికం ఏ విద్యార్థికీ అడ్డంకి కారాదనే లక్ష్యంతో ప్రతిభావంతులైన పేద విద్యార్థులను ఆర్థిక ప్రోత్సాహం అందిస్తున్నామని మండల మానవత చైర్మన్ బలుసు సత్యనారాయణ అన్నారు. పల్లంట్ల గ్రామానికి చెందిన విద్యార్థిని ఎ.నిర్మలకు ఆర్థిక సహాయం అందిస్తున్న సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ ఏలూరు సిఆర్.రెడ్డి ఉమెన్స్ కాలేజ్‌లో ఇంటర్మీడియట్ చదువుతున్న పేద విద్యార్థినికి మానవతా సంస్థ సభ్యులు రిటైర్డ్ సిఆర్.రెడ్డి ఇంజినీరింగ్ కాలేజ్ ప్రిన్సిపల్ డాక్టర్ చలసాని ప్రసాద్, అరుణ గత సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం కూడా నిర్మలకు రూ.40 వేల కాలేజీ ఫీజు, హాస్టల్ ఫీజు కట్టారు. ఈ కార్యక్రమంలో మానవత సభ్యులు బలుసు విజయలక్ష్మి, నలమాటి లలిత, కె.గీత పాల్గొన్నారు.



విద్యార్థిని సాయం అందిస్తున్న చలసాని ప్రసాద్, అరుణలు

ఓటును కాపాడుకోవాలి

ప్రజాశక్తి-గోకవరం

ప్రతి ఒక్కరూ ఓట్ల పట్ల అప్రమత్తంగా వ్యవహరించాలని టిడిపి మాజీ జెడ్‌పిటిసి పాలూరి బోసు బాబు అన్నారు. గోకవరంలో బుధవారం బోసుబాబు మాట్లాడారు. వైసిపి అధికారం చేపట్టిన నాటి నుంచి ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసిందన్నారు. ప్రాథమిక హక్కులను హరించిందనిన్నారు. స్వాతంత్ర భారతదేశంలో ఓటు ప్రజల హక్కుని, ఆ హక్కులను కాలరాస్తూ ప్రజల ఓట్లను హరిస్తున్నారని బోసు తెలిపారు.

జనసేన కార్యకర్తకు సాయం

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

మండలంలోని తాడిపర్రుకు చెందిన జనసేన పార్టీ కారకర్త తోట పండు ఇటీవల అనారోగ్యానికి గురవడంతో పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి భోగవల్లి ప్రసాద్ ఆయనకు రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో వీరమల్ల బాలాజీ, కాకర్ల నాని పాల్గొన్నారు.

చివటంలో గడపగడపకూ..

ప్రజాశక్తి-ఉండ్రాజవరం

మండలంలోని చివటంలో నిడదవోలు ఎంఎల్ఎ జి.శ్రీనివాస్ నాయుడు బుధవారం గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో పలు వార్డుల్లో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా ఇటీవల గుండెపోటుకు గురై, అనారోగ్యంతో ఇంటి వద్ద ఉంటున్న ప్రజాశక్తి విలేకరి మడిపల్లి సాయిని ఆయన పరామర్శించి, ధైర్యం చెప్పారు. సామాన్యుడు కూడా ఆరోగ్యశ్రీ ద్వారా కార్పొరేట్ ఆసుపత్రిలో వైద్యం పొందడం ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి, రాష్ట్ర ప్రభుత్వానికి దీవెనలు అందజేస్తాయన్నారు. అనంతరం మహిళలను, రైతులను పలకరించారు. పిఎసిఎస్ అధ్యక్షులు కొఠారు సత్యనారాయణ, నాగిరెడ్డి వెంకటేశ్వరరావు, గన్నమని పుల్లయ్య, గుత్తికొండ శ్రీనివాసు, రాజమండ్రి శివ, అక్కల వెంకటేశ్వరరావు, తరపట్ల శీను పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

బీచ్‌కు కొట్టుకొచ్చిన యువతి మృతదేహం

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

కాకినాడ రూరల్ మండలం సూర్యారావుపేట ఎన్‌టిఆర్ బీచ్‌కు బుధవారం ఒక యువతి మృతదేహం కొట్టుకొచ్చింది. మృతదేహం వద్ద లభించిన ఐడి కార్డ్ ఆధారంగా కాకినాడ రంగరాయ మెడికల్ కాలేజ్‌లో ఫైనల్ ఇయర్ చదువుతున్న శ్వేతగా పోలీసులు గుర్తించారు. యువతి ప్రమాదవశాత్తు ప్రమాదం జరిగిందా లేక ఆత్మహత్యా లేక హత్య అనే విషయాలు విచారణలో తెలుస్తాయని పోలీసులు వెల్లడించారు. మృతదేహాన్ని పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం జి జి హెచ్‌కు తరలించారు.

బ్యాంకు మేనేజర్‌పై ఫిర్యాదు

ప్రజాశక్తి-అమలాపురం

అమలాపురం మొబర్లీపేట స్టేట్ బ్యాంక్ మేనేజర్ కెవిఎస్‌బిఆర్.వర్మ, అసిస్టెంట్ మేనేజర్ ఎలిటీ సుందరీలపై పట్టణానికి చెందిన ప్రముఖ న్యాయవాది కుడుపూడి అశోక్ పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేశారు. అశోక్ బ్యాంకు లావాదేవీల సమయంలో తన భార్య ఎకౌంటును క్లోజ్ చేయమని అడిగినప్పటికీ వారు చేయలేదని, సిబ్బందిని అడగడానికి తన భార్యతో కలిసి వెళ్లిన సమయంలో వెకిలి గా నవ్వుతూ ఇబ్బందులకు గురి చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. తాను హార్ట్ ఆపరేషన్ చేయించుకున్నానని తెలిసినా తన పనిని చేయమని అడిగినప్పటికీ బ్యాంకు మేనేజర్ నిర్లక్ష్య సమాధానం చెబుతూ తనను ఇబ్బందులు పాలు చేశారని పేర్కొన్నారు. తాను 25 సంవత్సరాలుగా న్యాయవాద వృత్తిలో అమలాపురం, జిల్లా, హైకోర్టులలో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తున్నానని ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ పనిచేస్తున్నానని తెలిపారు. తన పరువుకు భంగం కలిగించే విధంగా ప్రవర్తించడంతో బ్యాంకు మేనేజర్ వర్మ అసిస్టెంట్ మేనేజర్ సుందరీల పై పరువు నష్టం కేసు సంబంధించిన నోటీసు అందజేశామన్నారు. అలాగే ఆతనిపై చర్యలు తీసుకోవాలని అంబుడ్స్ మెన్ (రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, హైదరాబాద్) కు ఫిర్యాదు చేశానని అలాగే అమలాపురం పట్టణ పోలీస్ స్టేషన్ కేసు పెట్టానని తెలిపారు.

వివాహిత ఆత్మహత్య

ప్రజాశక్తి - మామిడికుదురు

మామిడికుదురులో వివాహిత మెండా సుజాత(29) కడుపు నొప్పి తాళలేక బుధవారం ఉదయం ఇంట్లో ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకుందని ఎస్ఐ పి.సురేష్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇవి.. తాపీ పని చేసుకుంటూ జీవనం సాగించే భర్త వెంకటేశ్వరరావు ఉదయం బయటకు వెళ్లిన తరువాత ఈ సంఘటన జరిగింది. ఈ విషయాన్ని భర్తకు ఫోన్ చేసి తెలపగా అతను వచ్చి ఆమెను కిందకు దింపి పేరూరు వైజంక్షన్ ప్రయివేట్ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ఆమె మృతి చెందిందని వైద్యులు ధ్రువీకరించారు. యానాం సమీపంలో మల్లవరంకి చెందిన సుజాతతో మామిడికుదురుకు వాసి మెండా వెంకటేశ్వరరావుతో 6 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు చిన్నారులు ఉన్నారు. మృతురాలు తల్లి గంగి రెడ్డి పద్మావతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు. మృత దేహాన్ని పోస్ట్ మార్టం కొరకు రాజోలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించామన్నారు.

గుండెపోటుతో మహిళ మృతి

ప్రజాశక్తి - ఆత్రేయపురం

ఆత్రేయపురం రజక పేటకు చెందిన కాకరపర్తి నూకాలు(55) బుధవారం తెల్లవారుజామున ఛాతిలో నొప్పి రావడంతో ఆమె గుండెపోటుతో మృతిచెందింది. కుటుంబ సభ్యులు ఆమెను ఆస్పత్రికి తరలించేందుకు 108 కి సమాచారం అందించారు. అయితే అప్పటికే ఆమె మృతిచెందింది. ఆమెకు భర్త లేకపోవడంతో ఒంటరిగా జీవిస్తోంది.

ఆభరణాలు స్వాధీనం దొంగ అరెస్టు

ప్రజాశక్తి-కడియం

కడియపులంకలో ఈ నెల 22న పుల్లా పెద్దసత్యనారాయణ ఇంట్లో 20.5 కాసుల 9 బంగారు ఆభరణాలు చోరీ కేసులో నిందితుని అరెస్టు చేసినట్లు కడియం పోలీసులు తెలిపారు. సిఐ తిలక్ వివరాలు తెలిపారు. పెదసత్యనారాయణ ఇంట్లో 20 ఏళ్లుగా పని చేస్తున్న పల్లా బాబీ రెండేళ్ల నుంచి ఇంట్లో తొమ్మిది బంగారు ఆభరణాలను పలుమార్లు చోరీ చేసినట్లు తెలిపారు. వాటిలో ఒక బ్రాస్లెట్, ఒక నల్లపూసల తాడు ఉంచుకుని మిగిలిన ఏడు బంగారు వస్తువులు వివిధ బ్యాంకుల్లో తాకట్టు పెట్టినట్లు తెలిపారు. నిందితుని అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి ఆభరణాలను స్వాధీన పరుచుకున్నట్లు వెల్లడించారు.

చెరువులో పడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి - తాళ్ళపూడి

పెద్దేవంలో సుంగిడి చెరువులో ఈ నెల 20న ప్రమాదవశాత్తు పడిపోయిన వివాహితుడు మృతి చెందాడని తాళ్లపూడి ఎస్ఐ రమణ తెలిపారు. పెద్దేవం గ్రామానికి చెందిన చిక్కాల గణేష్ (40) ఈ నెల 20న బయటకు వెళ్లి ఇంటికి రాలేదు. భార్య వెంకటలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసుగా నమోదు చేసినట్లు ఎస్ఐ కె.వి.రమణ తెలిపారు. బుధవారం ఉదయం చెరువులో మృతదేహం కనబడడంతో పోలీసులు గణేష్‌గా గుర్తించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రమణ తెలిపారు.

ఓటరు జాబితాలో 10 శాతం బినామీలు

ప్రజాశక్తి - కాకినాడ

ఓటరు జాబితాల్లో నివాసం లేని బినామీ ఓటర్లు అధికంగా ఉన్నారని కాకినాడ పౌర సంక్షేమ సంఘం పేర్కొంది. ఈ మేరకు సంఘం కన్వీనర్ దూసర్లపూడి రమణరాజు ఓ ప్రకటనను విడుదల చేశారు. ప్రభుత్వ ఉద్యోగుల ప్రత్యక్ష పరిశీలనలో ఇంటింటికీ వెళ్లి ఓటరు గుర్తించే నిర్దారణ లేకుండా జాబితాలను రూపొందించడం వలన పది శాతం డమ్మీ సంఖ్య ప్రతి పోలింగ్ బూత్‌లోనూ ఉందన్నారు. ఆధార్ అనుసంధానం ఓటరు జాబితాకు ప్రవేశ పెట్టకపోవడం వలన అవకతవకలు షరా మామూలుగా ఉండడం దురదృష్టకరమన్నారు. ఎన్నికల కమిషన్ జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా ఆధార్ అనుసంధానం చేపట్టే సంస్కరణలు చేపట్టాలన్నారు. సార్వత్రిక ఎన్నికల ముందు 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఓటర్ నమోదుకు నూరు శాతం అవకాశం ఇవ్వాలని ఆయన కోరారు.

యానాం వార్తలు

ఘనంగా జాతీయ బాలికా దినోత్సవం

ప్రజాశక్తి - యానాం


విద్యార్థికి బ్యాడ్జీలు పెడుతున్న హెచ్‌ఎం

స్థానిక కమల నెహ్రూ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం కెఎన్.లక్ష్మీ అధ్యక్షతన జాతీయ బాలిక దినోత్సవాన్ని జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జన విజ్ఞాన వేదిక యానాం కమిటీ అధ్యక్షుడు ఆనాల వీరభద్రరావు మాట్లాడుతూ ఆడపిల్ల సమాజానికి గర్వకారణమని, బాలికలు అందరూ ఇష్టపడి చదివి, ప్రభుత్వ అవకాశాలను ఉపయోగించుకుని అభివృద్ధి చెందాలన్నారు. ఈ సందర్భంగా ఆడపిల్ల దేశానికి గర్వకారణం అనే స్లోగన్లను ఆవిష్కరించారు. 'ఐ యాం నేషన్స్ ప్రైడ్' అనే బ్యాడ్జీలను విద్యార్థినిలకు అలంకరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర జెవివి.నాయకుడు కెవివి సత్యనారాయణ, గిరిజాదేవి, విపిఎస్ఎం.మంజరి పాల్గొన్నారు.

నేడు జాతీయ ఓటర్ల దినోత్సవం

ప్రజాశక్తి - యానాం

జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని జనవరి 25 గురువారం నిర్వహిస్తున్నట్లు రీజినల్ అడ్మినిస్ట్రేటర్, ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి ఆర్.మునిస్వామి బుధవారం తెలిపారు. స్థానిక డాక్టర్ ఎస్ఆర్‌కె ప్రభుత్వ ఆర్ట్స్ కాలేజీ కాన్ఫరెన్స్ హాలులో ఉదయం 10 గంటల నుంచి వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమానికి బూత్ లెవల్ ఆఫీసర్లు, బూత్ లెవల్ సూపర్వైజర్లు, నోడల్ అధికారులు, ఎలక్టోరల్ తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు.

స్టాండింగ్ కమిటీ ఏర్పాటుకు నిర్ణయం

ప్రజాశక్తి - యానాం


సమావేశంలో మాట్లాడుతున్న మునిస్వామి

2024 సార్వత్రిక ఎన్నికల నియామవళికి అనుగుణంగా పనిచేసేలా స్టాండింగ్ కమిటీ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. పరిపాల నాధికారి కార్యాల యంలో అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో పరిపాలనాధికారి మునిస్వామి బుధవారం సమావేశం నిర్వహించారు. ఎన్నికల ప్రకటనతో మోడల్ కోడ్ అఫ్ కాండక్ట్ అమల్లోకి రానుందని తెలిపారు. మోడల్ ప్రవర్తన నియమావళి పూర్తిగా అనుగుణంగా ఉండేలా యానాం అసెంబ్లీ సెగ్మెంట్ స్థాయిలో స్టాండింగ్ కమిటీ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ స్టాండింగ్ కమిటీలో యానాం ఎస్పితోపాటు, గుర్తింపు పొందిన జాతీయ, రాష్ట్ర పార్టీల నుంచి ఒక్కొక్కరు చొప్పున ఉండాలని నిర్ణయించారు.

ఫైనల్ రిహార్సల్స్

ప్రజాశక్తి - యానాం


కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

ఈ నెల 26న గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా స్థానిక జిఎంసి బాలయోగి క్రీడా మైదానంలో ఎస్పి రఘునాయగం, సిఐ షణ్ముగం, ఎస్ఐలు శేరు నూకరాజు, కట్టా సుబ్బరాజు, ట్రాఫిక్ ఎస్ఐ పువ్వుల వీరభద్ర స్వామి ఆధ్వర్యంలో పోలీసులు కవాతు ఫైనల్ రిహార్సల్స్ నిర్వహించారు. పుదుచ్చేరి పోలీస్, ఇండియన్ రిజర్వ్ బెటాలియన్, హోంగార్డ్స్ కవాతు నిర్వహించారు. కవాతు రిహార్సల్స్, గణతంత్ర దినోత్సవ కార్యక్రమాలను ఎస్పి పర్యవేక్షించారు.

తాడికోనలో నూరు శాతం కుల గణన సర్వే

ప్రజాశక్తి-అమలాపురం

అల్లవరం మండలం తాడికోన సచివాలయం లో సిబ్బంది, వాలంటీర్స్ ప్రస్తుతం నిర్వహిస్తున్న కుల సర్వే లో జిల్లాలోనే ప్రథమంగా 100శాతం పూర్తి చేశారని ఎంపిడిఒ బి.కృష్ణ మోహన్ బుధవారం తెలిపారు. 547 కుటుంబాల వివరాలు యాప్ లో నమోదు చేశారని నూరు శాతం లక్ష్యం జిల్లాలో మొదట సాధించిన సచివాలయంగా నిలిచిన తాడికోన కార్యదర్శులు రాజా, వీరబాబు సచివాలయం సిబ్బంది, వాలంటీర్స్ ను వత్తి పట్ల వారి అంకిత భావం ను గుర్తించి ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ బి.కృష్ణ మోహన్ వారికి అభినందనలు తెలిపి చిరు కానుకలు అందజేశారు. కార్యక్రమంలో ఎఒ బి.లక్ష్మణరావు, కార్యదర్శులు రాజా, వీరబాబు తాడికోన సచివాలయం సిబ్బంది వాలంటీర్స్ పాల్గొన్నారు.

కూళ్లలో ఉచిత పశువైద్య శిబిరం ఏర్పాటు

ప్రజాశక్తి-రామచంద్రపురం

కె.గంగవరం మండలంలోని కూళ్ల గ్రామంలో పామర్రు పశు వైద్య శాఖ ఆధ్వర్యంలో ఉచిత పశు వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. గ్రామ సర్పంచ్ చిల్లె నాగేశ్వరరావు ఈ పశువైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ వైద్య శిబిరంలో 180 పశువులను పరీక్షించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి కె. వెంకటరావు, పామర్రు పశు వైద్యులు ఎం.బిందు, పేకేరు పశు వైద్యులు సురేష్ బాబు, పాల్గొన్నారు. మొత్తం 42 మంది పాడిరైతులు కార్యక్రమానికి హాజరయ్యారు.

పాఠశాలకు మెగాఫోన్ బహూకరణ

ప్రజాశక్తి-రామచంద్రపురం

కె.గంగవరం మండలంలోని కోటిపల్లి ఎంపిపి పాఠశాలకు 5 వతరగతి చదువుతున్న విద్యార్థి గాలి హర్షవర్ధన్ తల్లిదండ్రులు గాలి బాలాజీ, దుర్గాదేవిలు రూ.15 వేలు విలువైన మెగాఫోన్ బుధవారం బహూకరించారు. పాఠశాలలో జరిగే పలు కార్యక్రమాలకు ఉపయోగపడుతుందనే ఉద్దేశంతో ఈ మెగాఫోన్‌ను బహూకరించినట్లు పాఠశాల హెచ్ఎం కెఆర్‌కె.ప్రసాద్ తెలిపారు. మెగా ఫోన్ బహూకరించినందుకు వారికి పాఠశాల తరపున ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ఎంపిఎస్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-మండపేట

న్యూ ఢిల్లీ సైన్స్ ఒలింపియాడ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపిఎస్ విద్యార్థులు 21 బంగారు పతకాలు సాధించి ప్రతిభ కనబరిచారు. బుధవారం స్కూల్ ఆవరణలో ఏర్పాటు చేసిన అభినందన సభలో విద్యాసంస్థల డైరెక్టర్ వల్లూరి చిన్నారావు మాట్లాడుతూ తమ విద్యార్థులు పతకాలు సాధించడం ఆనందంగా ఉందన్నారు. బంగారు పతకాలు సాధించిన విద్యార్థులను అభినందించి ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సమస్యలపై గళమెత్తిన కౌన్సిలర్లు

ప్రజాశక్తి - పిఠాపురం


సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ సూర్యవతి

మున్సిపాలిటీలో నెలకున్న సమస్యలపై కౌన్సిల్ సభ్యులు గళమెత్తారు. మున్సిపల్ బడ్జెట్‌కు పాలకవర్గం ఆమోదం తెలిపింది. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో బుధవారం చైర్‌పర్సన్ గండేపల్లి సూర్యవతి అధ్యక్షతన బుధవారం కౌన్సిల్ సమావేశం జరిగింది. సమావేశం ప్రారంభ దశలోనే 12వ వార్డ్ కౌన్సిలర్ బొజ్జ జగదీశ్వరి జగ్గయ్య చెరువులో నత్తనడకన జరుగుతున్న అభివృద్ధి పనులపై నిలదీశారు. అనంతరం 24- 25 సంవత్సరం అంచనా బడ్జెట్ రూ.3254.28 లక్షలుగా భావిస్తూ కౌన్సిల్ ఆమోదం తెలిపింది. బడ్జెట్ చదువుతుండగా పట్టణంలో అక్రమ కట్టడాలు లేవా వాటిపై ఫైన్ వెయ్యలేదని టిపిఓను బొజ్జ జగదీశ్వరి నిలదీశారు. 13వ వార్డ్ కౌన్సిలర్ తలిశెట్టి వెంకటేశ్వర మాట్లాడుతూ జెసిబి మున్సిపాలిటీ తరపున కొనాలని గతంలో కోరమని ఎందుకు కాలయాపన చేస్తున్నారాని అధికారులను ప్రశ్నించారు. 2వ వార్డ్ కౌన్సిలర్ సోమరౌతు లలితదేవి మాట్లాడుతూ పట్టణంలో పార్కింగ్ ప్లేస్ లేకుండా షాపింగ్ మాల్స్ నిర్మిస్తున్నారని డ్రైనేజీలపై అనధికారికంగా రాళ్ళు వేసి పార్కింగ్ చేస్తున్నా అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. టిడిపి ఫ్లోర్ లీడర్ అల్లవరపు నగేష్ మాట్లాడుతూ రెండున్నర సంవత్సరాల నుంచి ఎలక్ట్రికల్ పోల్స్ కోసం అడుగుతున్న పట్టించుకోవడం లేదని విద్యుత్ వైర్లు రోడ్డుపై వేలాడుతున్నాయని, ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యులని నిలదీశారు. ఎంపీ వంగా గీత విశ్వనాథ్ మాట్లాడుతూ జిజిఎంపి నిధులు త్వరితగతిన వచ్చేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అలాగే పట్టణంలో ఎలక్ట్రికల్ పోల్స్ కు ఎంపి నిధుల నుంచి రూ 20 లక్షలు కేటాయిస్తున్నట్లు ఆమె తెలిపారు. అంబేద్కర్ భవన్ నిర్మాణానికి గతంలో 50 లక్షలు ఇవ్వగా మరో అరవై లక్షలు మౌళిక సదుపాయాల కొరకు విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

ద్వితీయ ఉత్తమ ప్రదర్శనగా 'కబ్జా' నాటిక

ప్రజాశక్తి - సామర్లకోట రూరల్


కబ్జా నాటకంలో ఓ సన్నివేశం

ప్రవాసాంధ్ర ప్రజా నాట్య మండలి ఆధ్వర్యంలో డివి సత్యనారాయణ స్మారక నాటక పోటీలు పేరుతో బిలాయిలో ఈనెల 22, 23 తేదీల్లో నిర్వహించిన నాటక పోటీల్లో వృంగార వల్లభ ఆర్ట్స్ క్రియేషన్స్ సామర్లకోట చెందిన 'కబ్జా' నాటిక ద్వితీయ ఉత్తమ నాటికగా ఎంపికైంది. సామర్లకోట సకల కళా సమాఖ్య గౌరవాధ్యక్షులు, ప్రముఖ రచయిత, దర్శకులు కెబి ఆనంద్ దర్శకత్వంలో, కొంతం కాశీ విశ్వనాథ్ రచనలో రూపొందించిన ఈ నాటిక ఆద్యంతం సభికులను ఆకట్టుకున్నట్లు దర్శకులు ఆనంద్ చెప్పారు. కాగా ఉత్తమ నాటికగా కబ్జా నాటిక బహుమతి సాధించడం పట్ల కళా బృందానికి సామర్లకోట సకల కళా సమాఖ్య అధ్యక్షులు బడుగు సీతారామ రాజు, కోశాధికారి అలమండ ప్రసాద్, నాయకులు కేతినీడి శ్రీనివాసు, కర్రి ప్రభాకర్, కర్రి బాబురావు, కోర్లమండ కొండల రావు, తదితరులు అభినందనలు తెలిపారు.

పైప్‌లైన్ మరమ్మతు పనులు పూర్తి చేయాలి


పైపులైన్ పనుల ప్రగతిని పరిశీలిస్తున్న కమిషనర్ నాగ నరసింహారావు

ప్రజాశక్తి - కాకినాడ

సామర్లకోట కెనాల్ నుంచి శశికాంత్ నగర్ ట్రీట్మెంట్ ప్లాంట్‌కు ముడినీటిని సరఫరా చేసే పైప్‌లైన్‌కు యుద్ధ ప్రాతిపదికన మరమ్మతు పనులు చేపట్టాలని నగర కమిషనర్ సిహెచ్.నాగ నరసింహారావు ఆదేశించారు. అచ్చంపేట సమీపం లోని ఉండూరు వద్ద పైప్‌లైన్ ధ్వంసం కావడంతో రెండు రోజులుగా కొన్ని ప్రాంతాల్లో మంచినీటి సరఫరాకు అంతరాయం కలిగిన నేపథ్యంలో కమిషనర్ అధికారులతో కలిసి అక్కడ జరుగుతున్న మరమ్మతు పనులను బుధవారం పరిశీలించారు. పనుల ప్రగతిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పైప్‌లైన్ డామేజ్ కావడం వల్ల శశికాంత్ నగర్ ట్రీట్మెంట్ ప్లాంట్ పరిధిలోని సుమారు ఎనిమిది డివిజన్ల పరిధిలో నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడిందన్నారు. రమణయ్యపేట, బొందగుంట, కొండేలుపేట, డి- మార్ట్, దుమ్ములపేట, పర్లోపేట, రాజీవ్ గృహకల్ప వంటి ప్రాంతాలకు మంచినీటి సరఫరాలో సమస్య తలెత్తిందన్నారు. ఈ కారణంగా ఆయా డివిజన్ల ప్రజలు మంచినీటి కోసం ఇబ్బంది పడకుండా నగరపాలక సంస్థ వాటర్ వర్క్స్ విభాగం వద్ద అందుబాటులో ఉన్న ఆరు మంచినీటి ట్యాంకర్లతోపాటు మరో 6 అదనపు ట్యాంకర్లను కూడా సమకూర్చి మంచినీటిని సరఫరా చేస్తున్నామన్నారు. పైప్‌లైన్ మరమ్మతు పనులను మరింత వేగవంతంగా చేపట్టి సత్వరమే పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో ఎస్ఇ పి.సత్య కుమారి, ఇఇ మాధవి, ఎఇ రమేష్, వాటర్ వర్క్స్ సిబ్బంది పాల్గొన్నారు.

మోతాదుకు మించితే అనారోగ్య సమస్యలు

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

చిన్న చిన్న రోగాలకు సైతం యాంటీబయాటిక్ మందులు వినియోగించడం వలన పలు అనారోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉందని డాక్టర్ కుమార్ యాదవ్ అన్నారు. బోటు క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో బుధవారం జరిగిన ఉచిత వైద్య శిబిరంలో ఆయన మాట్లాడారు. ఎడాపెడా యాంటీబయాటిక్స్ వాడటం వలన శరీరంలో ఉపయోగపడే మంచి బ్యాక్టీరియా తొలగి జీర్ణాశయ సమస్యలు తలెత్తే అవకాశం ఉందన్నారు. పేగుపూత కూడా వచ్చే అవకాశం ఉందన్నారు. ఎప్పుడైనా అవసరమైనప్పుడు ఈ మందులు ఉపయోగపడవని అన్నారు. వైద్యుల సూచనల మేరకు యాంటీబయోటిక్స్ వాడాలన్నారు. అనంతరం వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అడబాల రత్న ప్రసాద్, రాజా తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన లాన్ టెన్నిస్ టోర్నమెంట్

ప్రజాశక్తి - కాకినాడ


విజేతలకు బహుమతులు అందచేస్తున్న అతిథులు

ఐదు రోజులుగా జిల్లా స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో జరుగుతున్న 67వ జాతీయ స్థాయి లాన్ టెన్నిస్ టోర్నమెంట్ బుధవారంతో ముగిసింది. బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమంలో ఎంఎల్ఎ కురసాల కన్నబాబు పాల్గొని మాట్లాడారు. శారీరక మానసిక ఎదుగుదల కు క్రీడలు సహకరిస్తాయిని తెలిపారు. స్పోర్ట్స్ పట్ల, విద్యార్థుల పట్ల రాష్ట్ర ప్రభుత్వానికి మంచి అభిప్రాయం ఉందన్నారు. విద్యార్థుల పురోగతికి కృషి చేస్తున్నదని వివరించారు. జాతీయస్థాయిలో ప్రతిభను కనబరిచిన విద్యార్థులందరికీ అభినందనలు తెలిపారు. జాతీయస్థాయిని చక్కగా నిర్వహించిన అధికారులను ఆయన అభినందించారు. ఎంఎల్‌సి కర్రి పద్మశ్రీ మాట్లాడుతూ భవిష్యత్‌లో అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులుగా ఎదగాలని ఆకాంక్షించారు. ప్రాంతీయ సంయుక్త సంచాలకులు జి.నాగమణి మాట్లాడుతూ వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన క్రీడాకారులు చక్కటి ప్రతిభను కనబరిచారన్నారు. ఈ కార్యక్రమంలో జడ్‌పిటిసి సుబ్బారావు, జెఎన్‌టియు పాలకమండలి సభ్యులు బెజవాడ సత్యనారాయణ, కర్రి భూమి రెడ్డి, పాఠశాల గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్ర చైర్మన్ జి.భానుమూర్తి, ఉపవిద్యాశాఖాధికారులు ఆర్‌జె.డేనియల్ రాజు, డి.సుభద్ర, డిఎస్‌డిఒ బి.శ్రీనివాస కుమార్, మండల విద్యాశాఖ అధికారులు సిహెచ్.రవి, ఏసుదాసు, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు పూర్తి చేయాలి

ప్రజాశక్తి - తాళ్లరేవు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి సునీత

ఎన్నికల కోడ్ రాకముందే అభివృద్ధి పనులను పూర్తి చేయాలని ఎంపిపి రాయుడు సునీత అన్నారు. మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపిపి సునీత అధ్యక్షతన బుధవారం జరిగింది. ఈ సందర్భంగా మండలంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై ఆమె అధికారులకు దిశా నిర్దేశం చేశారు. మూడు నెలల కాలంలో మండలంలో జరిగిన అభివృద్ధి పనులను సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. పటవల, తాళ్లరేవు, జి.వేమవరం, కోరంగి, పోలేకుర్రు, పంచాయతీల్లో సుమారు రూ.60 లక్షలతో అభివృద్ధి పనులకు సభ ఆమోదం తెలిపింది. డిసెంబరులో జరిగిన పంట నష్టానికి మండలం నుంచి 448 హెక్టార్లు, 963 మంది రైతులను గుర్తించామని తెలిపారు. పాత కోరంగిలో మురుగు కాలువల్లో పూడికతీత పనులు చేపట్టాలని కోరంగి ఎంపిటిసి సభ్యులు రత్నకుమారి కోరారు. దళితులకు ప్రభుత్వం ఉచితంగా అందించే 200 యూనిట్ల విద్యుత్ సౌకర్యాన్ని పేద ప్రజలు ఉపయోగించుకునేలా విద్యుత్ శాఖ అధికారులు అవగాహన కల్పించాలని ఇంజరం ఎంపిటిసి సభ్యులు కోరుకొండ కిరణ్మయి అధికారులను కోరారు.

జెఎఎస్ శిబిరాలను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి - పెద్దాపురం

జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ప్రజల వద్దకు వచ్చి అందిస్తున్న వైద్య సేవలు ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్ అన్నారు. బుధవారం స్థానిక గోలి వారి వీధిలోని సచివాలయంలో ఏరియా ప్రభుత్వ ఆసుపత్రి వైద్య బృందం ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ వైద్య శిబిరం ద్వారా అవసరమైన వారికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించడమే కాకుండా ఉచితంగా మందులు పంపిణీ కూడా చేస్తున్నారన్నారు. ఏరియా ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ అనూష, డాక్టర్ శిరీష, డాక్టర్ బివివిసిహెచ్ సత్యవాణి, డాక్టర్ పావని ఆధ్వర్యంలో వైద్య సేవలు అందించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు త్సలికి సత్య భాస్కరరావు, విడదాసరి రాజా, కౌన్సిల్ కోఆప్షన్ సభ్యుడు వాసంశెట్టి గంగ, అడ్మిన్ వెంకటరమణ పాల్గొన్నారు.

చిత్తడి నేలల సంరక్షణ అందరి బాధ్యత

ప్రజాశక్తి - తాళ్లరేవు

ప్రకృతి విపత్తుల నుంచి సమాజాన్ని కాపాడటానికి చిత్తడి నేలలను పరిరక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రముఖ జీవవైవిధ్య నిపుణుడు కోక మృత్యుంజయరావు పిలుపునిచ్చారు. మండలంలోని కోరంగి పర్యాటక కేంద్రంలో ఎపి నేషనల్ గ్రీన్ కోర్, ఎపి స్కూల్ ఎడ్యుకేషన్, అటవీశాఖ సంయుక్తంగా చిత్తడి నేలల సంరక్షణపై అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్తడి నేలల పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎపి గ్రీన్ కోర్ స్టేట్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ కె.గోవిందరావు, రీజనల్ కోఆర్డినేటర్ కేసరి శ్రీనివాస్, జిల్లా కోఆర్డినేటర్ కెవికె.మహేశ్వరరావు, అటవీ శాఖ అధికారి మహేష్, సిబ్బంది భైరవమూర్తి, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, అటవీశాఖ అధికారులు పాల్గొన్నారు.

షర్మిల పర్యటనను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి - ఏలేశ్వరం

ఈ నెల 25న ఎపిసిసి అధ్యక్షురాలు వైఎస్ షర్మిల పర్యటనను విజయవంతం చేయాలని ప్రత్తిపాడు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జ్ ఉమ్మిడి వెంకట్రావు పిలుపునిచ్చారు.

సాంకేతికతతో మంచి విద్య

ప్రజాశక్తి - ఏలేశ్వరం

సాంకేతిక బోధన ద్వారా విద్యార్థులకు మరింత నాణ్యమైన విద్యను అందించే అవకాశం ఉంటుందని ఏలేశ్వరం ఎంపిపి గొల్లపల్లి బుజ్జి అన్నారు. బుధవారం మండలంలోని పెద్దనాపల్లి, సిరిపురం, లింగంపర్తి, తిరుమాలి, జె అన్నవరం పాఠశాలల విద్యార్థులకు స్టడీ మెటీరియల్, డిజిటల్ ట్యాబ్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో జడ్‌పిటిసి నీరుకొండ సత్యనారాయణ, ఎంపిటిసి సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమాజాభివృద్ధికి 'విద్యే' కీలకం

ప్రజాశక్తి - కాకినాడరూరల్

స్థిరమైన అభివృద్ధి, మానవ హక్కులు, ప్రపంచ శాంతి ఒక్క విద్యుతోనే సాధ్యమని విశ్రాంతి ఉపాధ్యాయులు నిమ్మకాయల వెంకటేశ్వరరావు అన్నారు. బోటు క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో బుధవారం అంతర్జాతీయ విద్యా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2019 జనవరి 24 నుంచి ప్రతి ఏటా అంతర్జాతీయ విద్యా దినోత్సవంగా జరుపుకుంటున్నామని అన్నారు. 'శాశ్వత శాంతి కోసం నేర్చుకోవడం' అనే థీమ్ ఈ ఏడాది లక్ష్యమని అన్నారు. విద్య లేకపోతే జ్ఞానం, విలువలు కరువై హింసాత్మక సంఘర్షణలు పెరుగుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో అడబాల రత్న ప్రసాద్ ,రాఘవరావు, సత్యనారాయణ చౌదరి పాల్గొన్నారు.

కాకినాడ సమావేశాన్ని విజయవంతం చేయాలి

ప్రజాశక్తి-అంబాజీపేట

పిసిసి అధ్యక్షురాలు వైఎస్.షర్మిల గురువారం కాకినాడలో నిర్వహించే సమావేశాన్ని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పార్టీ శ్రేణులు తరలి వచ్చి విజయవంతం చేయాలని పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జంగా గౌతమ్ పిలుపుచ్చారు. అంబాజీపేటలో మాచవరం శివన్నారాయణ ఇంటి వద్ద బుధవారం పి.గన్నవరం నియోజకవర్గ కన్వీనర్ వంటెద్దు బాబి అధ్యక్షతన సమావేశం జరిగింది. అధికార పార్టీ ఎమ్మెల్యే కొందరు షర్మిల సమక్షంలో పార్టీలో జాయిన్ అవ్వనున్నారని ఈ సమావేశాన్ని విజయవంతం చేయాలని పిలుపిచ్చారు. ఈ కార్యక్రమంలో పీసీసీ వైస్ ప్రెసిడెంట్ కొత్తూరి శ్రీను, తదితరులు పాల్గొన్నారు.